# గంజాయి విక్రేతలు పట్టివేత

- ఐదుగురు అరెస్ట్



వివరాలు వెల్లడిస్తున్న ఎస్పీ రాహుల్ హెగ్డే

సూర్యాపేట సిటీ, ఫిబ్రవరి 11 : చిలుకూరు మండలంలో గంజాయి అమ్మకానికి పాల్పడుతున్న ఐదుగురు వ్యక్తులను అరెస్ట్ చేసినట్లు ఎస్పీ రాహుల్ హెగ్డే తెలిపారు. నిందితుల వద్ద నుంచి 2 కిలోల 400 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకుని ఎన్‌డీపీఎస్ యాక్ట్ కింద కేసు నమోదు చేసినట్లు చెప్పారు. ఆదివారం జిల్లా పోలీస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో కేసు వివరాలు వెల్లడించారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా టేకులపల్లి గ్రామానికి చెందిన బోడ సురేశ్, బానోతు మోహన్, భూక్య అఖిల్, ఖమ్మం జిల్లా తిరుమలాయపాలెం మండలం బిచ్చోడుతండాకు చెందిన ధరావత్ వినోద్, కుసుమంచి మండలం మంగలితండాకు చెందిన నునావత్ సాయి, చిలుకూరు మండలం బేతవోలు గ్రామానికి చెందిన గణపారపు శ్రీకాంత్ ఆరుగురు స్నేహితులు. ఆంధ్ర, ఒడిశా సరిహద్దులో గంజాయిని కిలో రూ.4,500కు కొనుగోలు చేసి సూర్యాపేట చుట్టుపక్కల విక్రయిస్తూ లాభం పొందుతున్నారు. ఈ నెల 10న ఇదే విధంగా చేస్తుండగా నమ్మకమైన సమాచారంతో చిలుకూరు పోలీసులు మాటు వేసి ఐదుగురిని పట్టుకున్నారు. మరో వ్యక్తి పరారీలో ఉన్నట్లు తెలిపారు. సమావేశంలో ఏఎస్పీ నాగేశ్వర్‌రావు, కోదాడ రూరల్ సీఐ రామకృష్ణారెడ్డి, చిలుకూరు ఎస్ఐ శ్రీనివాస్, సిబ్బంది వెంకటేశ్వర్లు, నరేశ్, నగేశ్, అలీమొద్దీన్ పాల్గొన్నారు.

## ఈ 13న కేసీఆర్ బహిరంగ సభను విజయవంతం చేయాలి

- బీఆర్ఎస్ నేరేడుచర్ల మండలాధ్యక్షుడు సురేశ్‌బాబు



నేరేడుచర్ల : చలో నల్లగొండ బహిరంగ సభ వాల్‌పోస్టర్‌ను విడుదల చేస్తున్న బీఆర్ఎస్ పార్టీ నాయకులు

నేరేడుచర్ల, ఫిబ్రవరి 11 : కృష్ణానది జలాలపై తెలంగాణ హక్కులను కాపాడుకోవడం కోసం ఈ నెల 13న నల్లగొండ జిల్లా కేంద్రంలో బీఆర్ఎస్ పార్టీ అధినేత, మాజీ సీఎం కేసీఆర్ నిర్వహించే బహిరంగ సభను విజయవంతం చేయాలని ఆ పార్టీ మండలాధ్యక్షుడు అరిబండి సురేశ్‌బాబు పిలుపునిచ్చారు. ఆదివారం పార్టీ మండల కార్యాలయంలో ఏర్పాటు చేసిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. కృష్ణా బేసిన్ ప్రాజెక్టులను కృష్ణా రివర్ మేనేజ్‌మెంట్ బోర్డ్ (కేఆర్ఎంబీ)కి అప్పగించాలని కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంతో నాగార్జునసాగర్, శ్రీశైలం రిజర్వాయర్ల పరిధిలోని ప్రజలకు, రైతులకు తీవ్ర అన్యాయం జరుగుతుందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకున్న అనాలోచిత నిర్ణయాన్ని వ్యతిరేకించాలన్నారు. అనంతరం బహిరంగ సభ వాల్ పోస్టర్‌ను విడుదల చేశారు. సమావేశంలో మాజీ ఎంపీపీ చెన్నబోయిన సైదులు, మాజీ జడ్పీటీసీ నారాయణరెడ్డి, పార్టీ మండల మాజీ అధ్యక్షుడు చింతకుంట్ల సోమిరెడ్డి, నాయకులు సుదర్శన్, జగతయ్య, గురువయ్య, శంకర్, సైదులు, వీరారెడ్డి, నాగార్జున, నరసయ్య, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

నూతనకల్ : చలో నల్లగొండను విజయవంతం చేయాలని ఎంపీపీ భూరెడ్డి కళావతీ సంజీవరెడ్డి, జడ్పీటీసీ కందాల దామోదర్‌రెడ్డి కోరారు. మండల కేంద్రంలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. సభకు మండలంలోని అన్ని గ్రామాల నుంచి రైతులు, బీఆర్ఎస్ శ్రేణులు అధిక సంఖ్యలో తరలిరావాలని పిలుపునిచ్చారు. సమావేశంలో పార్టీ మండలాధ్యక్షుడు మున్న మల్లయ్య, నాయకులు బత్తుల సాయిల్, చూడి లింగారెడ్డి, బద్దం ప్రశాంత్‌రెడ్డి, కొంపెల్లి రాంరెడ్డి, ఏర్పుల నరేశ్, బత్తుల విజయ్, బత్తుల సురేశ్ పాల్గొన్నారు.

అర్వపల్లి : ఈ 13న నల్లగొండలో జరిగే బీఆర్ఎస్ బహిరంగ సభను విజయవంతం చేయాలని ఆ పార్టీ జిల్లా నాయకుడు మొరిశెట్టి ఉపేందర్ అన్నారు. జాజిరెడ్డిగూడెంలో పోస్టర్‌ను ఆవిష్కరించి మాట్లాడారు. కార్యక్రమంలో మల్లయ్య, నాగరాజు, పెద్ది శ్రీనివాస్, యాగానందం, వెంకన్న, సోమయ్య, రాజు, మహేశ్ పాల్గొన్నారు.

## వడ్డెరలను ఎస్టీలో చేర్చాలి

- తెలంగాణ వడ్డెర సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు వెంకన్న




సమావేశంలో మాట్లాడుతున్న రాష్ట్ర ఉపాధ్యక్షుడు వెంకన్న

బొడ్రాయిబజార్, ఫిబ్రవరి 11 : వడ్డెరల బతుకులు మారాలంటే వడ్డెర కులాన్ని బీసీ నుంచి ఎస్టీ జాబితాలో చేర్చాలని అందుకు రాష్ట్ర ప్రభుత్వం అసెంబ్లీలో తీర్మానం చేసి కేంద్రానికి పంపించాలని వడ్డెర సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు సూర వెంకన్న, ఉమ్మడి నల్లగొండ జిల్లా అధ్యక్షుడు దండుగుల సైదులు డిమాండ్ చేశారు. ఆదివారం స్థానిక వడ్డెర సంఘం భవనంలో ఏర్పాటు చేసిన జిల్లా ముఖ్య నాయకుల సమావేశంలో వారు మాట్లాడారు. వడ్డెర కార్మికులు ప్రమాదవశాత్తు వృత్తిలో మరణిస్తే రూ.20 లక్షల ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలని, అలాగే వడ్డెర కార్పొరేషన్ ఏర్పాటు చేసి వెయ్యి కోట్లు కేటాయించాలన్నారు. వడ్డెర కాంట్రాక్టర్లకు ప్రభుత్వ పనుల్లో 20 శాతం ఈఎండీ లేకుండా పనులు కేటాయించి బండ క్వారీలపై వడ్డెర్లకు పూర్తి హక్కులు కల్పించాలని కోరారు. సమావేశంలో సంఘం జిల్లా అధ్యక్షులు ఆలకుంట్ల బాలకృష్ణ, ప్రధాన కార్యదర్శి ఇరుగుదిండ్ల అంజయ్య, జిల్లా ఉపాధ్యక్షుడు కొడిదల రాంబాబు, ఉద్యోగ సంఘం జిల్లా అధ్యక్షుడు కళింగం, మట్టి పనివార్ల సంఘం అధ్యక్షుడు శివరాత్రి విజయ్ పాల్గొన్నారు.

## సారవంతమైన కవిత్వానికి ప్రజాదరణ

- విశ్రాంత ఆంధ్ర ఉపన్యాసకుడు భరతారావు



కోదాడలో కవి యాత్రను జెండా ఊపి ప్రారంభించి మాట్లాడుతున్న విశ్రాంత ఆంధ్ర ఉపన్యాసకుడు భరతారావు

కోదాడ, ఫిబ్రవరి 11 : సారవంతమైన కవిత్వానికి సమాజ ఆదరణ ఉంటుందని విశ్రాంత ఆంధ్ర ఉపన్యాసకుడు మంత్రిప్రగడ భరతారావు అన్నారు. ఆదివారం కోహడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో కవి యాత్రను జెండా ఊపి ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. కవులు ఎవరికి వారే నియంత్రణ చేసుకుని అర్థవంతమైన కవిత్వాన్ని రచించాలని సూచించారు. యాత్ర బరాకత్‌గూడెం మునగాల నుంచి నడిగూడెంలో రాజువారి కోటకు చేరుకున్నది. కార్యక్రమంలో సాహితీ కళాపీఠం అధ్యక్షుడు సిలువేరు లింగమూర్తి, పుష్పాల కృష్ణమూర్తి, పొట్లూరి హరికృష్ణ, బి.వెంకట్, ఎస్.ఎస్.రావు, ఆదిలాబాద్, నిజామాబాద్, నిర్మల్‌కు చెందిన కవులు పాల్గొన్నారు.

## ఈ 16న జరిగే సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలి

- ఐఎఫ్‌టీయూ జిల్లా అధ్యక్షుడు నవీన్

గరిడేపల్లి, ఫిబ్రవరి 11 : కార్మిక, కర్షకుల పట్ల కేంద్ర ప్రభుత్వం అవలంభిస్తున్న విధానాలను వ్యతిరేకిస్తూ ఈ నెల 16న వివిధ కార్మిక సంఘాల ఆధ్వర్యంలో జరిగే దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలని ఐఎఫ్‌టీయూ జిల్లా అధ్యక్షుడు కామళ్ల నవీన్ అన్నారు. మండలంలోని గడ్డిపల్లి గ్రామంలో గల తెలంగాణ ప్రగతిశీల హమాలీ, మిల్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో సమ్మెకు సంబంధించిన పోస్టర్‌ను ఆదివారం ఆయన ఆవిష్కరించి మాట్లాడారు. కార్యక్రమంలో సంఘ నాయకులు పాల్గొన్నారు.

మోతె : ఈ 16న చేపట్టనున్న గ్రామీణ భారత్ బంద్‌ను విజయవంతం చేయాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ధూళిపాళ ధనుంజయనాయుడు అన్నారు. మండల కేంద్రంలో విలేకరులతో ఆయన మాట్లాడుతూ దేశంలో మోదీ పాలన వచ్చిన తర్వాత కార్మికులపై దాడులు మొదలైనట్లు తెలిపారు. సంఘం జిల్లా అధ్యక్షుడు రాజు పాల్గొన్నారు.

# ఆరు గ్యారెంటీలు కాదు...పేద బిడ్డల ప్రాణాలకు గ్యారెంటీ కావాలి

- బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్.ఎస్.ప్రవీణ్‌కుమార్
- ఇమాంపేట గురుకుల విద్యార్థిని ఆత్మహత్యపై బీఎస్పీ నిరసన

సూర్యాపేట రూరల్, ఫిబ్రవరి 11 : కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తామంటున్న ఆరు గ్యారెంటీలు కాదు.. తమ పేద బిడ్డల ప్రాణాలకు గ్యారెంటీ కావాలని బహుజన్ సమాజ్ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ ఆర్.ఎస్.ప్రవీణ్‌కుమార్ అన్నారు. సూర్యాపేట రూరల్ మండలం ఇమాంపేట సాంఘిక సంక్షేమ గురుకుల బాలికల కళాశాలలో ఇంటర్ సెకండియర్ చదువుతున్న విద్యార్థిని దగ్గుపాటి వైష్ణవి శనివారం రాత్రి హాస్టల్ గదిలో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నది. ఆదివారం మృతదేహాన్ని సూర్యాపేట ఏరియా ఆస్పత్రిలో ఆర్.ఎస్.ప్రవీణ్‌కుమార్ సందర్శించి విద్యార్థిని తల్లిదండ్రులను ఓదార్చారు. అనంతరం ఇమాంపేట గురుకుల కళాశాల వద్ద పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలిసి ఆందోళనకు దిగారు. ఈ సందర్భంగా విలేకరులతో ఆయన మాట్లాడుతూ.. తెలంగాణ మంత్రివర్గంలో ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ సంక్షేమ మంత్రులు లేకపోవడం శోచనీయమన్నారు. గురుకులాలు, వసతి గృహాల్లో విద్యార్థుల వరుస ఆత్మహత్యలపై ముఖ్యమంత్రి స్పందించాలన్నారు. అసెంబ్లీ సమావేశాల్లో విద్యార్థినుల వరుస ఆత్మహత్యలపై అధికార, ప్రతిపక్ష నాయకులు చర్చించకపోవడం దురదృష్టకరమన్నారు. భువనగిరి గురుకులంలో విద్యార్థినులు చనిపోతే రెండు నిమిషాలు కూడా మౌనం పాటించకపోవడం హేయమైన చర్య అన్నారు. ఆ తడి ఆరకముందే మరోక విద్యార్థిని బలైందని కనీసం మంత్రి గాని, సంబంధిత శాఖల ప్రిన్సిపల్ సెక్రటరి గాని విద్యార్థుల తల్లిదండ్రులకు భరోసా కల్పించడానికి రాకపోవడం సిగ్గుమాలిన చర్యకు పరాకాష్ట అన్నారు. విద్యార్థినుల ఆత్మహత్యలపై ప్రభుత్వం సమగ్ర విచారణ జరిపించి బాధ్యులను శిక్షించాలన్నారు. అలాగే చనిపోయిన విద్యార్థుల కుటుంబాలకు కోటి రూపాయల ఎక్స్‌గ్రేషియా, కుటుంబంలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఆత్మహత్యకు కారణమైన ప్రిన్సిపాల్, సంబంధిత అధికారులను సస్పెండ్ చేయాలన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా అన్ని సంక్షేమ గురుకులాలు, వసతి గృహాల్లో విద్యార్థుల కోసం ప్రత్యేకంగా సైకాలజిస్టులను నియమించాలని తెలిపారు. విద్యార్థుల ఆత్మహత్యలకు నిరసనగా ఈ 12న సోమవారం హైదరాబాద్‌లోని సంక్షేమ భవన్ ముందు మహాధర్నా చేపట్టనున్నట్లు పేర్కొన్నారు. సుమారు 3గంటల పాటుకు పైగా ఆందోళన కొనసాగుతుండటంతో విషయం తెలుసుకున్న జిల్లా అదనపు కలెక్టర్ వెంకట్‌రెడ్డి, డీఎస్పీ నాగభూషణం, సీఐ రాజశేఖర్‌తో పాటు మరో ఇద్దరు సీఐలు, ఎస్ఐలు గురుకుల పాఠశాల వద్దకు చేరుకున్నారు. జిల్లా కలెక్టర్ పాఠశాల వద్దకు రావాలని నినాదాలు చేయగా అదనపు కలెక్టర్ వెంకట్‌రెడ్డి పాఠశాల వద్దకు వచ్చి వైష్ణవి కుటుంబానికి న్యాయం చేస్తామని హామి ఇవ్వడంతో ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ ఆందోళనను విరమించారు.



ఇమాంపేట గురుకుల పాఠశాల వద్ద ఆందోళనలో పాల్గొన్న బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్

### వైష్ణవి కుటుంబానికి న్యాయం జరిగేలా చూస్తాం



వైష్ణవి మృతదేహానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి

- ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి

బొడ్రాయిబజార్, ఫిబ్రవరి 11 : ఇమాంపేట గురుకుల పాఠశాలలో శనివారం రాత్రి ఆత్మహత్యకు పాల్పడిన సూర్యాపేట జిల్లా కేంద్రంలోని 9వ వార్డుకు చెందిన దగ్గుపాటి భాగ్యమ్మ వెంకన్న కుమార్తె వైష్ణవి భౌతికకాయాన్ని ఆదివారం రాత్రి మాజీ మంత్రి, ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి సందర్శించి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం వైష్ణవి తల్లిదండ్రులను పరామర్శించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. విద్యార్థిని మృతిపై విచారణ జరిపించాలని, తప్పు చేసిన వారు ఎవరైనా శిక్ష అనుభవించాల్సిందేనని, బాధిత కుటుంబానికి న్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఆయన వెంట మున్సిపల్ చైర్‌పర్సన్ పెరుమాళ్ల అన్నపూర్ణ, జడ్పీ వైస్ చైర్మన్ గోపగాని వెంకటనారాయణగౌడ్, బీఆర్ఎస్ నాయకుడు మారిపెద్ది శ్రీనివాస్‌గౌడ్, నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

**సమగ్ర విచారణ చేయాలి..**

బొడ్రాయిబజార్ : విద్యార్థిని వైష్ణవి ఆత్మహత్యపై సమగ్ర విచారణ చేసి దోషులను కఠినంగా శిక్షించాలని ప్రొగ్రెసివ్ డెమొక్రటిక్ టీచర్స్ ఫడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు ఆవుల నాగరాజు, మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షుడు తలమల్ల హసేన్ ఆదివారం వేర్వేరు ప్రకటనల్లో ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. విద్యార్థిని కుటుంబానికి రూ.50 లక్షల ఎక్స్‌గ్రేషియా, కుటుంబంలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం ప్రకటించాలని పేర్కొన్నారు.

**ఆత్మహత్య కేంద్రాలుగా గురుకులాలు**

ఆత్మహత్య కేంద్రాలుగా గురుకులాలు మారుతున్నాయని ఎస్ఎఫ్ఐ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ధనియాకుల శ్రీకాంత్‌వర్మ, ఎస్ఎఫ్ఐ బాలిక జిల్లా నాయకులు జయంతి, నందిని అన్నారు. వైష్ణవి మృతిపై జిల్లా కేంద్రంలో నిరసన వ్యక్తం చేసి మాట్లాడారు. రాష్ట్ర వ్యాప్తంగా గురుకులాల్లో ఎంతో భవిష్యత్ ఉన్న విద్యార్థులు రాలిపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

### నేడు నేరేడుచర్ల మున్సిపల్ చైర్మన్, వైస్ చైర్మన్ ఎన్నిక

నేరేడుచర్ల, ఫిబ్రవరి 11 : నేరేడుచర్ల మున్సిపాల్ చైర్మన్, వైస్ చైర్మన్ ఎన్నికను సోమవారం నిర్వహించనున్నారు. మున్సిపాలిటీలో మొత్తం 15 మంది కౌన్సిలర్లగాను 13వ వార్డు కౌన్సిలర్ చల్లా శ్రీలతారెడ్డి కౌన్సిలర్, వైస్ చైర్మన్ పదవికి రాజీనామా చేశారు. జనవరి 23న అవిశ్వాస సమావేశం ఏర్పాటు చేయడంతో మిగిలిన 14 మంది కౌన్సిలర్లలో 13 మంది కౌన్సిలర్లు అవిశ్వాసానికి మద్దతుగా ఓటు వేయడంతో చైర్మన్ జయబాబు పదవి కోల్పోయాడు. దాంతో మున్సిపల్ చైర్మన్, వైస్ చైర్మన్ పదవులకు ఎన్నిక నిర్వహించడం అనివార్యం కావడంతో రాష్ట్ర ఎన్నికల సంఘం ఈ నెల 12న స్థానిక మున్సిపల్ కార్యాలయంలో ఉదయం 11 గంటలకు నిర్వహించాలని జిల్లా కలెక్టర్, మున్సిపల్ కమిషనర్‌కు ఉత్తర్వులు జారీ చేసింది. దాంతో నేడు నిర్వహించే ఎన్నికల్లో 11వ వార్డుకు చెందిన బచ్చలకూరి ప్రకాష్ మున్సిపల్ చైర్మన్‌గా, 5వ వార్డుకు చెందిన అలక సరిత వైస్ చైర్మన్‌గా ఎంపిక కానున్నట్లు సమాచారం.

### పెన్‌పహాడ్ పీహెచ్‌సీ ముందు గ్రామస్తుల ధర్నా

పెన్‌పహాడ్, ఫిబ్రవరి 11 : వైద్య సిబ్బంది అందుబాటులో ఉండడం లేదని పేర్కొంటూ గ్రామస్తులు, రోగులు కలిసి ఆదివారం పెన్‌పహాడ్ పీహెచ్‌సీ ముందు ధర్నాకు దిగారు. మండల కేంద్రానికి చెందిన చామకూరి లింగస్వామి తన కొడుకు రామచరణ్‌ను కుక్క కరిస్తే చికిత్స కోసం ఆస్పత్రికి తీసుకొచ్చాడు. అప్పటికే పలువురు రోగులు సిబ్బంది కోసం అక్కడ గంటల కొద్ది ఎదురు చూస్తున్నారు. దాంతో అసహనం చెందిన రోగులు, గ్రామస్తులు ఆస్పత్రి ఎదుట ధర్నాకు దిగారు. ధర్నా సమాచారం అందడంతో సిబ్బంది హుటాహుటిన ఆస్పత్రికి చేరుకుని చికిత్సలు అందిచారు.

### చెరువు మట్టి తరలింపు అడ్డగింత

చివ్వెంల, ఫిబ్రవరి 11 : చెరువు నుంచి మట్టి డంప్ చేసి తరలిస్తున్న ట్రాక్టర్లను గ్రామస్తులు అడ్డగించిన ఘటన మండలంలోని వట్టిఖమ్మంపహాడ్‌లో ఆదివారం జరిగింది. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. మండల పరిధిలోని వట్టిఖమ్మంపహాడ్ గ్రామంలో ఇటుక బట్టీల నిర్వాహకులు ఏడాది క్రితం పెద్దచెరువు మట్టిని అక్రమంగా డంప్ చేశారు. ఆదివారం ఇటుక బట్టీలకు తరలిస్తున్న ట్రాక్టర్లను గ్రామస్తులు అడ్డగించి మైనింగ్ అధికారులకు సమాచారం అందించారు. అధికారులు సంఘటనా స్థలానికి చేరుకుని మట్టి తరలింపును నిలిపి వేయించారు. విచారణ అనంతరం బాధ్యులపై చర్యలు తీసుకోనున్నట్లు మైనింగ్ అధికారి రాజు తెలిపారు. ఆయన వెంట ఐబీ వర్క్ ఇన్‌స్పెక్టర్ రవి ఉన్నారు.

### తాగునీటి సమస్యను పరిష్కరించాలి

– సీపీఎం మండల కార్యదర్శి యాకైబ్

గరిడేపల్లి, ఫిబ్రవరి 11 : మండలంలోని అబ్బిరెడ్డిగూడెం గ్రామంలో నెలకొన్న తాగునీటి సమస్యను పరిష్కరించాలని సీపీఎం మండల కార్యదర్శి షేక్ యాకైబ్ అన్నారు. ఆదివారం అబ్బిరెడ్డిగూడెంలో విలేకరులతో ఆయన మాట్లాడుతూ గ్రామంలో ఐదు బోర్లు ఉన్నా కేవలం రెండు బోర్లు మాత్రమే పని చేస్తున్నాయన్నారు. దాంతో గ్రామంలోని పలు వీధులకు నీరులేక ఇబ్బందులు పడాల్సిన పరిస్థితి నెలకొందన్నారు. అధికారులు స్పందించి తాగునీటికి ఇబ్బందులు లేకుండా చూడాలని కోరారు. సమావేశంలో రోషమ్మ, సైదులు, మహేశ్, రాంరెడ్డి, వెంకన్న, వీరయ్య, ప్రశాంత్ పాల్గొన్నారు.

# ఇన్సూరెన్స్ పేరిట ఘరానా మోసం

- పెట్టిన పెట్టుబడికి మూడురెట్లు ఇస్తామంటూ ఆశ
- అమాయకుల నుంచి రూ.30 కోట్లు వసూల్ చేసి పరార్
- హుజూర్‌నగర్ స్టేషన్‌లో బాధితుల ఫిర్యాదు



ఫిర్యాదు చేసేందుకు హుజూర్‌నగర్ పోలీస్ స్టేషన్‌కు వచ్చిన బాధితులు

హుజూర్‌నగర్/గరిడేపల్లి, ఫిబ్రవరి 11 : టీ లైఫ్ ఇన్సూరెన్స్ పేరిట, పెట్టిన పెట్టుబడికి సంవత్సరం లోపే మూడు రెట్లు ఇస్తామంటూ అమాయకులకు ఆశజూపి ఇద్దరు వ్యక్తులు రూ.30 కోట్లు వసూలు చేసి పరారయ్యారు. జరిగిన మోసంపై బాధితుల్లో పలువురు ఆదివారం హుజూర్‌నగర్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఘటనకు సంబంధించి వివరాలు..సూర్యాపేట జిల్లా గరిడేపల్లి మండలం వెల్దండ గ్రామానికి చెందిన కందుల వినయ్(32) ఇదే గ్రామానికి చెందిన పుల్లెంల అనిల్(30)ను ఏజెంట్‌గా నియమించుకుని టీ లైఫ్ ఇన్సూరెన్స్ పేరిట ఆరోగ్యం బాగాలేని వారు, రెండు లేదా మూడు నెల్లలో చనిపోయే వారికి రూ.లక్ష ఇన్సూరెన్స్ కడితే 9 నెలల 25 రోజులకు రూ.6 లక్షలు వస్తాయని నమ్మబలికి ఇన్సూరెన్స్ కట్టించుకునేవారు. అలాగే ఇన్సూరెన్స్ కంపెనీలో పెట్టుబడి పెడితే ఏడాదిలోపే మూడు రెట్లు ఇస్తామంటూ ఆశజూపి నగదు కట్టించుకున్నారు. ఇలా రెండేండ్లుగా చేస్తున్నారు. హుజూర్‌నగర్, కోదాడ నియోజకవర్గంలోని పలు గ్రామాలు, ఖమ్మం, మునగాల పరిధిలో ఏజెంట్లను నియమించుకుని సింగిల్, గ్రూప్ ఇన్సూరెన్స్ పేరిట రూ.లక్ష నుంచి రూ.30 లక్షల వరకూ ఇలా దాదాపు 350 మంది నుంచి రూ.30 కోట్లు వసూలు చేశారు. ఈ విషయం పట్ల ఎక్కువ మంది ఆకర్షితులు అవుతుడండంతో ఇతర జిల్లాల్లోనూ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని కృష్ణా జిల్లాలోనూ ఏజెంట్లను నియమించి వారికి 15 నుంచి 20 శాతం వరకు కమీషన్ ఇస్తామనడంతో వారు బాధితులకు ప్రామిసరీ నోట్‌లు, అగ్రిమెంట్ బాండ్‌లు రాసిస్తూ కోట్లలో నగదును కట్టించి సంబంధిత వ్యక్తుల చేతిలో పెట్టినట్లు సమాచారం. కేవలం వెలిదండ గ్రామంలోనే సుమారు 20 మందికి పైగా బాధితులు ఉన్నట్లు తెలుస్తున్నది. ఇన్సూరెన్స్ క్లైమ్‌కు వారు చెప్పిన సమయం మించిపోవడంతో డబ్బులు ఇంకా రావడం లేదని పేర్కొంటూ పలువురు వినయ్, ఇతర ఏజెంట్లను ఒత్తిడి చేశారు. దాంతో వారిలో కొంత మందికి బ్లాంక్ చెక్కులు, ప్రాంసరి నోట్లు రాసిచ్చారు. అయినా డబ్బులు రాకపోవడంతో తాము పోసపోయామని గ్రహించి బాధితులు హుజూర్‌నగర్ పోలీసులను ఆశ్రయించి ఫిర్యాదు చేశారు. సంబంధిత వ్యక్తి తమ నుంచి రూ.30 లక్షలు తీసుకుని ఇవ్వకపోగా అడిగితే బెదిరించాడంటూ ఓ మహిళ తన బాధను వెళ్లబోసుకున్న వీడియో సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతున్నది. అలాగే హుజూర్‌నగర్ మండలంలోని మాధవరాయినిగూడేనికి చెందిన ఓ వ్యక్తి తన స్నేహితులతో కలిసి రూ.32 లక్షలు కంపెనీలో కట్టగా తనకు నగదును ఇవ్వలేదంటూ హుజూర్‌నగర్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ప్రధాన నిందితుడు వినయ్ కుటుంబంతో సహా ప్రస్తుతం పరారీలో ఉన్నాడు.

## విద్యార్థులకు వ్యక్తిత్వ వికాసంపై అవగాహన



వ్యక్తిత్వ వికాసంపై అవగాహన కల్పిస్తున్న వ్యక్తిత్వ వికాస నిపుణుడు రాజశేఖర్

నడిగూడెం, ఫిబ్రవరి 11 : జీవితంలో ఎదురయ్యే అటుపోట్లను సమర్థంగా ఎదుర్కొనేందుకు వ్యక్తిత్వ వికాసం దోహదం చేస్తుందని వ్యక్తిత్వ వికాస నిపుణుడు చారుగండ్ల రాజశేఖర్ అన్నారు. ఆదివారం మండల కేంద్రంలోని కస్తూర్బా పాఠశాలలో విద్యార్థులకు వ్యక్తిత్వ వికాసంపై అవగాహన కల్పించి మాట్లాడారు. గొప్ప వ్యక్తుల జీవితాల్లోని విజయాలు, అపజయాలు స్ఫూర్తిగా తీసుకుని ముందుకు సాగాలని సూచించారు. పరీక్షల్లో మార్కులు తక్కువ వచ్చాయని ఆందోళనకు గురి కావొద్దని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఏఎస్ఐ జగన్నాథం, స్పెషల్ ఆఫీసర్ వెంకటరమణ పాల్గొన్నారు.

## పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



అర్వపల్లి : ఉపాధ్యాయులతో పూర్వ విద్యార్థులు



మోతె : సమ్మేళనంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు

మోతె, ఫిబ్రవరి 11 : మండలంలోని సిరికొండ గ్రామంలో 1999–2000 సంవత్సరంలో 10వ తరగతి చదివిన విద్యార్థులు ఆదివారం పూర్వ విద్యార్థుల సమ్మేళనం నిర్వహించారు. తమకు చదువు చెప్పిన ఉపాధ్యాయులు రంగయ్య, రత్నాచారి, వాజితా అలీ, నర్సిరెడ్డి, వెంకట్‌రెడ్డి, వాసుదేవరావును పూలమాలలు, శాలువాలతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు రాములు, రమేశ్, హరిచంద్రు, ప్రతిమా, నగేశ్, కాటమయ్య, సరిత, సైదులు, ఉప్పయ్య, వీరభద్రం, హుస్సేన్ పాల్గొన్నారు.

అర్వపల్లి : మండలంలోని తిమ్మాపురం జడ్పీహెచ్ఎస్‌లో 1987–92 ఆరు నుంచి పదో తరగతి వరకు చదివిన విద్యార్థులు హైస్కూల్ ప్రాంగణంలో ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. తమకు చదువు చెప్పిన గురువులను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో సూర్యాపేట జడ్పీటీసీ జీడి భిక్షం, గురువులు గోపాల్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, కృష్ణమూర్తి, లక్ష్మారెడ్డి, రాధాకృష్ణమూర్తి, వెంకటేశ్వర్లు, స్వరాజ్యం, భాగ్యలక్ష్మి, ఇందుర్తి వెంకట్‌రెడ్డి, పగిళ్ల శంకర్, జ్యోతిల శ్రీనివాసులు, రవీందర్, ఎల్లయ్య, వీరారెడ్డి పాల్గొన్నారు.

### బాల భవన్‌ను సద్వినియోగం చేసుకోవాలి

- పాడుతా తీయగా ఫేమ్ రాజాబాబు

సూర్యాపేట అర్బన్, ఫిబ్రవరి 11 : జిల్లా కేంద్రంలోని బాల భవన్‌ను విద్యార్థులు సద్వినియోగం చేసుకుని సంగీతం, కళలపై శిక్షణ తీసుకోవాలని పాడుతా తీయగా ఫేమ్ టి.రాజాబాబు అన్నారు. ఆదివారం బాల భవన్‌ను ఆయన సందర్శించిన మాట్లాడారు. ఈ సందర్భంగా విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలను తిలకించి వారిని అభినందించారు. కార్యక్రమంలో బాల భవన్ సూపరింటెండెంట్ బండి రాధాకృష్ణారెడ్డి, ఎల్లయ్య, ఉమా, అనిల్, సాయి, వీరూనాయుడు, బుర్రి వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

### రవాణారంగ సమస్యలు పరిష్కరించాలి

- లారీ అసోసియేషన్ రాష్ట్ర నాయకుడు రామారావు

కోదాడటౌన్, ఫిబ్రవరి 11 : కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన 'హిట్ అండ్ రన్' చట్టాన్ని రద్దు చేసి రవాణా రంగం ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించాలని తెలంగాణ లారీ అసోసియేషన్ రాష్ట్ర నాయకుడు ఆవుల రామారావు అన్నారు. ఆదివారం కోల్‌కతాలో జరిగే ఆల్ ఇండియా మోటార్ ట్రాన్స్‌పోర్ట్ కార్పొరేషన్ సమావేశాలకు కోదాడ లారీ అసోసియేషన్ నాయకులు తరలివెళ్లారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రోజురోజుకి పెరుగుతున్న ఇంధన ధరలు, టోల్ చార్జీలు, పోలీస్ చలానాలతో లారీ యాజమానులు అనేక ఇబ్బందులు పడుతున్నట్లు తెలిపారు. సమావేశాల్లో దేశ వ్యాప్తంగా భవిష్యత్ కార్యాచరణను నిర్ణయించనున్నట్లు వెల్లడించారు. తరలివెళ్లిన వారిలో కోదాడ లారీ అసోసియేషన్ అధ్యక్షుడు కనగాల నాగేశ్వర్‌రావు, అంజిరెడ్డి, దుర్గాప్రసాద్, జగన్నాథరెడ్డి, సాజిద్ ఖాన్, ఫయాజ్ పాల్గొన్నారు.

### హుజూర్‌నగర్ నూతన సీఐ, ఎస్ఐ బాధ్యతల స్వీకరణ

హుజూర్‌నగర్, ఫిబ్రవరి 11 : హుజూర్‌నగర్ సర్కిల్ నూతన సీఐగా చరమంద రాజు, ఎస్ఐగా ముత్తయ్య ఆదివారం పట్టణంలోని పోలీస్ కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ సర్కిల్ పరిధిలో శాంతి భద్రతాల పరిరక్షణకు కృషి చేస్తానని తెలిపారు.

### నాగారం సర్కిల్ సీఐగా రఘువీరారెడ్డి

నాగారం, ఫిబ్రవరి 11 : నాగారం సర్కిల్ నూతన సీఐగా రఘువీరారెడ్డి ఆదివారం బాధ్యతలు స్వీకరించారు. ఈయన గతంలో మల్టీ జోన్–2 సీఐడీగా పనిచేసి బదిలీపై నాగారం వచ్చారు. ఇక్కడ పనిచేసిన శివశంకర్ హైదరాబాద్ మల్టీజోన్–2 హెడ్ క్వార్టర్స్‌కు బదిలీ అయ్యారు.

### మేళ్లచెర్వు ఎస్ఐగా పరమేశ్

మేళ్లచెర్వు, ఫిబ్రవరి 11 : మేళ్లచెర్వు ఎస్ఐగా పరమేశ్ ఆదివారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పనిచేసే సురేశ్‌యాదవ్ సూర్యాపేట వీఆర్‌కు బదిలీ అయ్యారు. అలాగే మేళ్లచెర్వు ఎంపీడీఓగా పనిచేస్తున్న ఇసాక్‌హుస్సేన్ నాగర్‌కర్నూల్ జిల్లాకు బదిలీ అయ్యారు.

### కోదాడ ట్రాఫిక్ ఎస్ఐగా మల్లేశ్

కోదాడ రూరల్, ఫిబ్రవరి 11 : కోదాడ ట్రాఫిక్ ఎస్ఐగా మల్లేశ్ ఆదివారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ విధులు నిర్వహిస్తున్న రాంబాబు చిలుకూరు మండల కేంద్రానికి బదిలీ కావడంతో జిల్లా కేంద్రంలో విధులు నిర్వహించే మల్లేశ్ కోదాడ ట్రాఫిక్ ఎస్ఐగా బాధ్యతలు స్వీకరించారు.

### చాక్లెట్ ఆశ చూపి చిన్నారి కిడ్నాప్‌కు యత్నం

నేరేడుచర్ల, ఫిబ్రవరి 11 : చిక్లెట్ ఆశ జూపి చిన్నారిని అపహరించేందుకు యత్నించిన ఘటన నేరేడుచర్ల పట్టణంలోని చింతబండ వద్ద శనివారం సాయంత్రం జరిగింది. చింతబండ ప్రాథమిక పాఠశాలలో 5వ తరగతి చదుతున్న చిన్నారి (10) సాయంత్రం బడి నుంచి ఇంటికి వెళ్తున్నది. ఆ సమయంలో బైక్‌పై నిక్కరు, టీషర్ట్ వేసుకుని వచ్చిన వ్యక్తి చిన్నారికి చాకెట్లు ఆశ చూపి తీసుకోమని అడిగాడు. ఎంత బ్రతిమాలాడిన చిన్నారి చాకెట్లు తీసుకోకుండా దగ్గరలో ఉన్న ఇంట్లోకి వెళ్లింది. విషయం ఇంట్లోని వారికి చెప్పడంతో వారు బయటకు వచ్చి చూడగా దుండగుడు ఉడాయించాడు. ఈ విషయమై ఫిర్యాదు అందలేదని ఎస్ఐ పరమేశ్ తెలిపారు.

### ఓపెన్ టెన్త్, ఇంటర్ పరీక్షల ఫీజు గడువు పెంపు

నూతనకల్, ఫిబ్రవరి 11 : తెలంగాణ ఓపెన్ స్కూల్ సొసైటీ ఆధ్వర్యంలో పదో తరగతి, ఇంటర్మీడియట్ పరీక్షల ఫీజు చెల్లింపునకు గడువు పొడిగించడమైనదని నూతనకల్ జడ్పీహెచ్ఎస్ హెచ్ఎం రాములునాయక్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. అపరాధ రుసుముతో ఈ నెల 21 వరకు ఫీజు చెల్లించవచ్చని వెల్లడించారు. పదో తరగతి విద్యార్థులు సబ్జెక్టుకు రూ.100, ఇంటర్ విద్యార్థులు సబ్జెక్టుకు రూ.150 చెల్లించాలని పేర్కొన్నారు.

### ఆర్థిక సాయం

నాగారం, ఫిబ్రవరి 11 : మండలంలోని ఈటూరు గ్రామానికి చెందిన సయ్యద్ మోసిన్ ఇటీవల అకాల మరణం చెందారు. ఆదివారం తనతో పాటు చదువుకున్న పదో తరగతి స్నేహితులు కుటుంబాన్ని పరామర్శించి రూ.26 వేల ఆర్థిక సాయం అందజేశారు. కార్యక్రమంలో దూదిగాని నరేశ్, గొడిశాల వీరేందర్, బండి ఉపేందర్, కసిరబోయిన సతీశ్, కొరివి సోమన్న, పేరాల సత్యసాగర్, నాగరాజు, సిరాజ్ పాల్గొన్నారు.

### కబడ్డీ పోటీలకు క్రీడాకారుల ఎంపిక

హుజూర్‌నగర్, ఫిబ్రవరి 11 : హుజూర్‌నగర్ నియోజకవర్గంలోని చింతలపాలెంలో ఈ నెల 16 నుంచి 19 వరకు జరిగే 33వ తెలంగాణ రాష్ట్ర సబ్ జూనియర్ కబడ్డీ పోటీలకు క్రీడాకారుల ఎంపికను పట్టణంలోని బాలుర ఉన్నత పాఠశాలలో ఆదివారం నిర్వహించారు. 150 మంది బాలురు, 70 మంది బాలికలు ఎంపికలో పాల్గొనగా వారిలో 20 మంది బాలికలు, 20 బాలురు ఎంపికైనట్లు కబడ్డీ అసోసియేషన్ జిల్లా అధ్యక్ష్య, కార్యదర్శులు బెల్లకొండ రామచందర్‌గౌడ్, నామా నరసింహారావు తెలిపారు. నాలుగు రోజుల పాటు శిక్షణను నిర్వహించి అనంతరం ప్రధాన జట్టును ప్రకటిస్తామని పేర్కొన్నారు.

### ఈ 13న ఇంగ్లిష్ స్పెల్ విజార్డ్ పోటీలు

బొడ్రాయిబజార్, ఫిబ్రవరి 11 : ఇంగ్లిష్ లాంగ్వేజ్ టీచర్స్ అసోసియేషన్ సూర్యాపేట ఆధ్వర్యంలో ఈ నెల 13న జిల్లా స్థాయి స్పెల్ విజార్డ్ పోటీలను నిర్వహిస్తున్నట్లు ఆ సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు బి.సుధీర్, పబ్బతి వెంకటేశ్వర్లు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. స్థానిక ప్రభుత్వ ఎంఎం పాఠశాలలో 13న ఉదయం 10 గంటలకు పోటీలు నిర్వహించడం జరుగుతుందన్నారు. ఉపాధ్యాయులు, విద్యార్థులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. పోటీల్లో దాదాపు 40 పాఠశాలలకు పైగా డ్రామా కాంపిటీషన్‌లో పాల్గొంటున్నట్లు తెలిపారు.